క్లుప్తంగా

పౌష్టికాహారంతోపాటు మెరుగైన విద్య



తెలకపల్లి: చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారంతోపాటు మెరుగైన విద్య అందిస్తున్నారని పంచాయతీ ఈఓ భాస్కర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీస్కూల్ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఈఓ హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని సౌకర్యాల ద్వారా విద్యార్థులను మంచి ప్రవర్తనతో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు క్రమం తప్పకుండ తమ చిన్నారులను కేంద్రాలకు పంపించాలని సూచించారు. అనంతరం చిన్నారులకు ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ చంద్రకళ, పుష్పమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

వడదెబ్బకు నాలుగు లేగదూడలు మృతి



పెంట్లవెల్లి: విపరీతమైన ఎండలు ఉండడంతో మండలంలోని సింగవరంలో తెలుగు వెంకటయ్య పాడి రైతుకు చెందిన నాలుగు లేగదూడలు శుక్రవారం రాత్రి మృతి చెందాయి. ఉదయం లేగదూడలను చనిపోవడం చూసి ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పశువులను తెచ్చుకుంటే ఒకేసారి నాలుగు దూడలు చనిపోవడం ఎంతో బాధగా ఉందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. లేగదూడలను స్థానిక పశు వైద్య సిబ్బంది పరీక్షించారు.

గురువుకు అండగా విద్యార్థులు



కల్వకుర్తి: విద్యాబుద్ధులు నేర్పి ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు అనారోగ్యం బారిన పడిన ప్రైవేటు ఉపాధ్యాయుడికి విద్యార్థులు శనివారం చేయూతనందించారు. 1979లో పదో తరగతి చదివిన విద్యార్థులకు పాఠాలు బోధించిన తిరుపతిరెడ్డికి రూ.42 వేలు ఆర్థికసాయం అందించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో భారతి, రియాజ్, గౌస్, వేణు, హరికృష్ణ, అనిల్ ఉన్నారు.

కరపత్రాలు విడుదల

కోడేరు: లోక్‌సభ ఎన్నికల్లో మల్లు రవిని గెలిపించాలని శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాము అధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో చామంతి రాజు, రాము, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ ర్యాంకర్‌కు సన్మానం



వెల్దండ: విద్యార్థులు జీవిత లక్ష్యాన్ని ఎంచుకొని పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పోషమ్మగడ్డతండాకు చెందిన వడ్యావత్ యశ్వంత్‌నాయక్ ఇండియన్ సివిల్ సర్వీస్‌లో627 ర్యాంక్ సాధించడంతో సన్మాన సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీఓ సునీత, రేవంత్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, గిరి, ఫైయాజ్, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఇసుక తరలింపులో నిబంధనలు పాటించాలి

తాడూరు: మండలంలోని పాల్మూరును అనుసరించుకుని ఉన్న దుందుబి నది నుంచి ఇసుక తరలింపు నిబంధనల మేరకే కొనసాగాలని తహసీల్దార్ ప్రమీళ శనివారం ప్రకటనలో తెలిపారు. తమ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని తెలిపారు. ఎలాంటి తేడాలు వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు అందినా జిల్లా అధికారులు ఇచ్చిన నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా తరలిస్తే ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు.

పాలమూరు టు కందనూలు

- అడుగడుగునా కేసీఆర్‌కు నీరాజనాలు
- సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



జిల్లా కేంద్రంలో కేసీఆర్ బస్సుయాత్ర

సాక్షి, నెట్‌వర్క్: బస్సుయాత్రలో భాగంగా శనివారం సాయంత్రం మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ చౌరస్తాలో, మండలంలోని ఎల్కిచర్ల సమీపంలోని ఏవీఆర్ కాలనీ వద్ద బీఆర్ఎస్ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. పాలకొండలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఫాంహౌస్ నుంచి నాగర్‌కర్నూల్‌కు బస్సులో వెళ్తుండగా భూత్పూర్ చౌరస్తాలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, సీనియర్ నాయకులు నారాయణ గౌడ్, మాజీఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, మురళీధర్ గౌడ్, మైనార్టీ నేత మహ్మద్ సాదిక్, సత్యనారాయణ, యాసీన్, కౌన్సిలర్లు, నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. బ్రిడ్జి పై నుంచి కేసీఆర్‌పై పూల వర్షం కురిపించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి నిర్వహించిన కేసీఆర్ రోడ్‌షోకు కొల్లాపూర్‌కు నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ స్పోర్ట్ అథారిటీ చైర్మన్ ఆంజనేయ గౌడ్ నేతృత్వంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వాహనాల్లో వచ్చిన బీఆర్ఎస్ నాయకులు కొల్లాపూర్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమన్నారు. తెలకపల్లితోపాటు మండలంలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు కేసిఆర్ సభకు తరలివెల్లారు. చారకొండ మండల కేంద్రంతోపాటు తిమ్మాయిపల్లి, జూపల్లి, సిర్సనగండ్ల నుంచి బీఆర్ఎస్ నాయకులు వెళ్లారు. కొల్లాపూర్ మండలంలోని పలు గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. వెల్దండ మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు.

కార్యకర్తలకు అభివాదం చేసిన కేసీఆర్

కేసీఆర్ నాగర్‌కర్నూల్‌లో నిర్వహించే సభకు శనివారం సాయంత్రం బిజినేపల్లి మీదుగా బస్సుయాత్ర కొనసాగింది. కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కేసీఆర్‌కు ఘనస్వాగతం పలికారు.



బిజినేపల్లిలో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న కేసీఆర్



కొల్లాపూర్‌లో బీఆర్ఎస్ నాయకుల ర్యాలీ

మేడేను విజయవంతం చేయండి



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న శివశంకర్



అచ్చంపేటలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

నాగర్‌కర్నూల్ రూరల్: మేడేను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించి మాట్లాడారు. మేడే పండుగలో అన్ని కార్మిక సంఘాలు పాల్గొనే విధంగా చూడాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, శ్రీనివాసులు, బాలపీర్, భీమయ్య, యాదయ్య, ఆంజనేయులు, శ్రీశైలం, వెంకటస్వామి, రవిందర్, చంటి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మేడే ఉత్సవాలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ శనివారం పిలుపునిచ్చారు. పలు సంఘాల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. అనుబంధ సంఘాలైన సభ్యులు వేడుకల్లో పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో శివలీల, చిట్టెమ్మ, స్వామి, నర్సింహ, ఈశ్వర్, చందు తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించనున్న మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. శనివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలు రద్దు చేసిందన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తున్నారన్నారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి హక్కులను కాపాడుకోవాలన్నారు. మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే దేశం ప్రమాదంలో పడుతుందన్నారు.

కోరం లేక మండలసభ వాయిదా

వెల్దండ: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ విజయ అధ్యక్షతన నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేశారు. మండల సమావేశం ఉంటుందని సభ్యులకు ముందస్తు సమాచారం ఇచ్చిన కేవలం ఎంపీపీ విజయ, వైస్ ఎంపీపీ శాంతి, బొల్లంపల్లి ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, అజిలాపూర్ ఎంపీటీసీ లక్ష్మమ్మ మాత్రమే హాజరయ్యారు. 12మంది ఎంపీటీసీ సభ్యులకు కేవలం నాలుగు మాత్రమే హాజరుకావడంతో సభను వాయిదా వేసినట్లు ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి ప్రకటించారు. సభను తిరిగి నిర్వహించే తేదీని తెలియజేస్తామన్నారు. మండల సభ ఉంటుందని మండల శాఖఅధికారులు, కార్యదర్శులు కార్యాలయానికి చేరుకున్నారు. వాయిదా వేయడంతో చేసేది ఏమిలేక తిరిగి వెళ్లిపోయారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి: కేసు నమోదు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని లింగాల రోడ్డులో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసి, బస్సు అద్దాలు ధ్వంసం చేసిన వ్యక్తులపై కేసు నమోదైంది. హెడ్‌కానిస్టేబుల్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం లింగాల రోడ్డు వద్ద రోడ్డుకు అడ్డంగా ఆటో ఉందని పక్కకు జరపాలని ఆర్టీసీ డ్రైవర్ జనార్దన్ కోరాడు. ఆటోలో ఉన్న చందంపేటకు చెందిన నీలాబాయి, హన్మంతు డ్రైవర్, కండక్టర్ సునితను తిట్టారు. మాటామాటా పెరిగి డ్రైవర్‌ను చెప్పుతో కొట్టి బస్సు అద్దాన్ని పగలకొట్టారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

వెల్దండ: మండలంలోని అజిలాపూర్, అంతిరెడ్డిలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో పెద్దయ్య, ఆనంద్, బాలస్వామి, జంగయ్య యాదవ్ తదితరులు ఉన్నారు.



వెలగని వీధి లైట్లు



తెలకపల్లి: మండలంలోని గౌరారంలో వీధిలైట్లు లేక గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గ్రామంలో పలు చోట్ల వెలగకపోవడంతో రాత్రివేళలో బయటకు రాలేని పరిస్థితి. రాత్రివేళలో పాములు, తేళ్లు ఇతర విషపు పురుగులు సంచరిస్తున్నాయని గ్రామంలో ఆయా కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా రోజుల నుంచి ఎస్సీ కాలనీతోపాటు పలు కాలనీలలో వీధి లైట్లు పని చేయడం లేదని గతంలో సర్పంచ్‌కు చెప్పిన పట్టించుకోలేదని, సర్పంచ్‌ల పదవికాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన, పంచాయతీ కార్యదర్శుల పాలన కొనసాగుతుందని వారి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించాలని ఆయా కాలనీలలో వీధిలైట్లను ఏర్పాటు చేసి ఇబ్బందులు తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు దాదాపు నెల రోజుల నుంచి వెలగడం లేదని తెలిపారు.

మగ్దుంపూర్ దర్గా విజయోత్సవాలు



లింగాల: మండలంలోని మగ్దుంపూర్ దర్గా ఎంతో మహిమగలదని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం దర్గాలో నిర్వహించి మగ్దూంశావాలి విజయోత్సవాలలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలకతీతంగా ప్రజలు దర్గాకు వచ్చి పూజలు చేయడం చాలా గొప్ప విషయమని అన్నారు. దర్గాపై ప్రజలు ప్రగాఢ విశ్వాసం ఉంచుకొని మొక్కులు చెల్లించుకుంటున్నట్లు తెలిపారు. దర్గా దినదినాభివృద్ధి చెందుతుందని, దర్గా అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో షఫీ, బారీ, ముక్తార్, కొండల్‌రావు, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

పేద ప్రజల పక్షాన పోరాడుతాం



తాడూరు: పేద ప్రజల పక్షాన తాము పోరాటం చేస్తామని బీఎంపీ ఎంపీ అభ్యర్థి విజయ్ అన్నారు. మండల కేంద్రంలో ప్రధాన వీధులు తిరుగుతూ శనివారం మంచం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహుజనులకు రాజ్యాధికారం రావాలంటే పేద, మధ్య తరగతి, శ్రామిక ప్రజలు ఒక్కటై గెలిపిస్తే బహుజనులకు న్యాయం కలుగుతుందన్నారు. ఆయన వెంట నాగయ్య, బుచ్చయ్య, స్వామి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్‌లు

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు శనివారం ఎంపీ అభ్యర్థి మల్లురవి సమక్షంలో చేరారు. పల్గుతండా మాజీ సర్పంచ్ బక్యానాయక్, రాఘుయపల్లి మాజీ సర్పంచ్ రామస్వామి మరికొంత మంది బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. పార్లమెంట్ ఎన్నికల్లో మల్లురవి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్‌బాలాజీసింగ్, మోతిలాల్‌నాయక్ తదితరులు ఉన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు విత్తుకోండి

పెద్దకొత్తపల్లి: ఆయిల్‌పాం తోటలు పెంచుతున్న రైతులు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మొక్కల చుట్టు కుదుర్లపై పచ్చిరొట్ట, జనుము విత్తనాలు విత్తుకోవడం వలన పాదులలో తేమశాతాన్ని కాపాడుతుందని కొల్లాపూర్ హార్టికల్చర్ అధికారి లక్ష్మణ్ తెలిపారు. వేసవిలో వచ్చే వేడి గాలుల వలన మొక్కను కాపాడుతుంది. జనుము పూతకు వచ్చాక దానిని ముక్కలు ముక్కలుగా చేసి ఫామ్‌ఆయిల్ మొక్క పాదుచుట్టు వేసుకోవాలన్నారు. ఇలా చేయడం వలన సేంద్రియ ఎరువుగా మారుతుందని తెలిపారు. అదేవిధంగా చెట్లకు ప్రతి రోజు డ్రిప్ ద్వారా నీరు అందించాలని సూచించారు.



ఫామ్‌ఆయిల్ మొక్క చుట్టు పచ్చిరొట్టు విత్తనాలు వేస్తున్న రైతు

తెలంగాణ ప్రజల గొంతుక బీఆర్ఎస్

నాగర్‌కర్నూల్: తెలంగాణ ప్రజల ఏకైక గొంతుక బీఆర్ఎస్ పార్టీ అని జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పార్టీ కార్యాలయంలో ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలవేసి, అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ పునర్నిర్మాణం కోసమే బీఆర్ఎస్ పుట్టిందన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిచేసి, ప్రపంచపటంలో నిలిపిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. వ్యవసాయ రంగంలో 2కోట్ల 50లక్షల మంది ఉపాధి పొందారని.. ఐటీ రంగంలో 6లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. 24గంటల కరెంటుతో పారిశ్రామిక రంగం ప్రగతి సాధించిందని వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు.



తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలవేసిన గువ్వల బాలరాజు, మర్రి జనార్దన్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

పట్టుదలతో ముందుకు..!

- కిడ్నీల పనితీరుపై పరిశోధన
- డాక్టరేట్ పొందిన రంగస్వామి

గట్టు: ఓపెన్ టెన్త్‌లో ఫెయిల్ అయి, రెండవ ప్రయత్నంలో పాసైన వ్యక్తి ఏకంగా డాక్టరేట్‌ను పొంది అందరి దృష్టిని ఆకర్షించాడు పెంచికలపాడు గ్రామానికి చెందిన రంగస్వామి. శుక్రవారం చెన్నైలో జరిగిన కార్యక్రమంలో ఫ్యాకల్టీ ఆఫ్ మెడిసిన్ (బయో కెమిస్ట్రీ) విభాగంలో చెన్నైలోని మీనాక్షి అకాడమి ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్‌లో కిడ్నీలపై పరిశోధన చేయడంతో డాక్టర్‌ను ప్రదానం చేశారు. ఈయన 2007–10గాను మహబూబ్‌నగర్ ఎస్‌వీఎస్ మెడికల్ కాలేజీలో ఎంఎస్సీ మెడికల్ బయో కెమిస్ట్రీ విభాగంలో గోల్డ్ మెడల్‌ను సాధించారు. పెంచికలపాడుకు చెందిన రంగన్న కుమారుడు రంగస్వామి గ్రామంలో కేవలం 5వ తరగతి వరకు మాత్రమే చదివేందుకు అవకాశం ఉండగా, అక్కడి వరకే మానేశాడు. 2000లో ఓపెన్ టెన్త్ రాయగా, అందులో ఫెయిల్ అయ్యారు. 2001లో మళ్లీ పరీక్ష రాసి థర్డ్ క్లాస్‌లో పాసయ్యారు. 2001–3 వరకు ఇంటర్ మహబూబ్‌నగర్‌లో, బీఎస్సీ ఎంఎల్‌టీని హైదరాబాద్‌లో 2003–6లో పూర్తి చేశారు. కిడ్నీలు దశల వారీగా పని చేస్తూ, దెబ్బతింటుంటాయని, వాటిని మనం సకాలంలో గుర్తించి, వాటి పని తీరును మెరుగు పరుచుకుంటే జీవిత కాలాన్ని మరికొంత వరకు పొడిగించుకునే అకాశం ఉంది. గుండెకు కిడ్నీకు లింకు ఉంటుంది. కిడ్నీ ఫెయిలూర్ అయితే గుండె పోటుతో చనిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దీనిపై పరిశోధనలకు డాక్టరేట్ లభించినట్లు రంగస్వామి తెలిపారు.



అసంపూర్తిగా సబ్‌స్టేషన్ పనులు

కల్వకుర్తిరూరల్: మండలంలోని ముకురాలలో ఐదేళ్ల క్రితం లోఓల్టేజి సమస్య పరిష్కారం కోసం సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రైతుల సమస్యలు తీర్చేందుకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సబ్‌స్టేషన్‌ను మంజూరు చేసింది. సబ్‌స్టేషన్ కోసం స్థలం కొనుగోలు చేసే పరిస్థితి లేదని దాతలు సహకరిస్తే పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు. గ్రామానికి చెందిన ఓ రైతు ముందుకొచ్చి స్థలాన్ని అప్పగించారు. దీంతో కాంట్రాక్టర్ ఐదేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు కాంపౌండ్‌వాల్ నిర్మించి, ఇనుప స్తంభాలు ఏర్పాటు చేశారు. సంవత్సరంలోనే సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి చేస్తామని విద్యుత్ అధికారులు పేర్కొన్నా, ఇప్పటి వరకు పూర్తి కాలేదు. ఈ సబ్‌స్టేషన్ పూర్తయితే పంజుగూల, ముకురాల, చిన్నముకురాల, రంగాపూర్ గ్రామాల పరిధిలోని రైతులకు లోఓల్టేజి సమస్య తీరేది. ఇది పూర్తి కాకపోవడంతో వేసవికాలంలో ట్రాన్స్‌ఫార్మర్‌లపై అధికభారం పడి మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పనులు వేగవంతం చెయ్యాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



స్తంభాలకే పరిమితమైన సబ్‌స్టేషన్

తాళం వేసిన ఇంట్లో చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో చోటుచేసుకుంది. ఎస్ఐ గోవర్ధన్ వివరాల మేరకు.. హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన రజియాబేగం శుక్రవారం రాత్రి ఇంటికి తాళంవేసి, మహబూబ్‌నగర్‌కు వెళ్లింది. గుర్తుతెలియని దుండుగులు ఇంటి తలుపులను ధ్వంసంచేసి, బీరువాలో ఉన్న 4 తులాల బంగారం ఆభరణాలు చోరీ చేశారు. శనివారం ఇంటికి వచ్చిన రజియాబేగం.. చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి, పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, క్లూస్ టీంతో వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రంథాలయానికి లైబ్రేరియన్ కరువు

- పదేళ్లుగా పుస్తకాల గదికి తాళం
- పాఠకులకు ప్రయోజనం చేకూర్చని శాఖా గ్రంథాలయం



ఉప్పునుంతల గ్రంథాలయం

ఉప్పునుంతల: మండల కేంద్రంలో ఉన్న శాఖా గ్రంథాలయానికి రెగ్యూలర్ లైబ్రేరియన్ లేకపోవడంతో పాఠకులకు ఏమాత్రం ప్రయోజనం చేకూరడంలేదు. పదేళ్లుగా ఈ పరిస్థితి నెలకొన్నా పాలకులు పట్టించుకోకపోవడంతో పాఠకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. లైబ్రేరియన్ లేకపోవడంతో పుస్తకాల గదికి ఎప్పుడు చూసినా తాళం వేసి ఉంటుంది. కేవలం అక్కడకు వచ్చే ఒకటి రెండు దినపత్రికలకు మాత్రమే పరిమితకావడంతో ఉదయం పూట కొంతమంది యువకులు ఆవరణలో కూర్చొని పత్రికలను చూసి వెళ్తున్నారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే వార, మాస పత్రికలు ఏమాత్రం అందుబాటులో ఉంచడంలేదని విద్యార్థులు, నిరుద్యోగ యువకులు ఆవేదన చెందుతున్నారు.

2వేలకు పైగా పుస్తకాలు..

ఈ గ్రంథాలయంలో మహనీయులకు సంబంధించిన పుస్తకాలతోపాటు మహాభారతం, పంచతంత్రం, విశ్వరహస్యం వంటి వివిధ రకాలైన 2వేలకు పైబడి పుస్తకాలు ఉన్నా ఎవ్వరికీ ఉపయోగపడటం లేదు. తమకు చదువుకోవాలని ఉన్నా లైబ్రేరియన్ లేక పుస్తకాలు ఉన్న గదికి తాళం వేసి ఉంచడంతో చదవలేక పోతున్నామని యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం సెలవు దినాల్లోనూ గ్రంథాలయంలోని పుస్తకాలు చదివే అవకాశం లేదని వాపోతున్నారు.

ఒకటి, రెండు రోజులు మాత్రమే ఇన్‌చార్జి లైబ్రేరియన్

స్థానిక శాఖా గ్రంథాలయానికి అచ్చంపేట లైబ్రేరియన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో ఆమె నెలలో ఒకటి, రెండు పర్యాయాలు మాత్రం ఇక్కడకు వచ్చి వెళ్తుంది. కేవలం పేపర్ బిల్లులు ఇవ్వడానికి మాత్రమే వచ్చి వెళ్తుండటంతో పుస్తకాలు చదువుకునే వీలు లేకుండా ఉంది. ఎక్కువ రోజులు పుస్తకాలను కదిలించకపోవడంతో విలువైన పుస్తకాలను చెదలు పట్టిపోతున్నాయి. ఇప్పటికే చాలా పుస్తకాలు పనికిరాకుండా పోవడంతో వాటిని మూలన పడేశారు. గ్రంథాలయంలో పనిచేస్తున్న పీటీడబ్ల్యూ మాత్రం పాఠకులు చదువుకునే ఒక్క గదిని తెరిచి ఉంచడంతో అక్కడకు వచ్చే దినపత్రికలు మాత్రమే పాఠకులకు అందుబాటులో ఉంటున్నాయి. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు శ్రద్ధ తీసుకొని గ్రంథాలయాన్ని అందరికి అందుబాటులో ఉంచడంలో పాటు పలువురికి ప్రయోజనం చేకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని పాఠకులు, విద్యార్థులు కోరుతున్నారు.

లైబ్రేరియన్ నియమిస్తే ప్రయోజనం



స్థానిక గ్రంథాలయానికి రెగ్యూలర్ లైబ్రేరియన్ నియమిస్తే పది మందికి ప్రయోజనం చేకూరుతుంది. కొన్నేళ్లుగా పుస్తకాలను ఇంటికి తీసుకొని చదువుకునే వీలు లేకుండా ఉంది. లైబ్రేరీ పేరిట వచ్చే దినపత్రికలు మాత్రమే చదువుకునే వీలుంటుంది. గ్రంథాలయం ఎవరికీ ఉపయోగపడటంలేదు. నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఇబ్బందిగా ఉంది.

– నాగరాజు, ఉప్పునుంతల